'ఆంధ్రభూమి' దినపత్రిక - 5.6.1987

# స్థాయి

ప్రకాష్‌కి ఆ సాయంత్రం గడవడం కష్టమయింది. ఒకటే బోర్! చూస్తే ఫేమిలీ లేరు. వూరెళ్ళారు. వారానికి గాని రారు. మిత్రుడు రామకృష్ణ ఇంటికెళ్తే వాడూ లేడు.

అతని స్కూటర్ లీలామహల్ వద్ద ఆగింది. సినిమా చూడాలనే బుద్ధి తనకు తరచూ కలగదు. తన చిన్నతనంలో అభిమాన హీరో సినిమా ఒకటి 15 సార్లు చూసిన వైనం గుర్తుకొచ్చి ఇప్పటికి నవ్వుకుంటాడు.

ప్రకాష్ ఫిల్మ్ సొసైటీ 'ఛాయ'లో మెంబరు. ఆ సినిమాలకి వెళ్తాడు. బాగుందని అందరూ అనుకుంటే ఇంగ్లీషు పిక్చర్లకి వెళతాడు. తెలుగు, హిందీ సినిమాలంటే చిన్న చూపు కాదు.

బాగున్నాయంటే ... వాటికి వెళతాడు. ఏమైన ఇంటరెస్టు మాత్రం లేదు.

మొన్న రామకృష్ణ పార్టీ ఇచ్చాడు. హోటల్‌కి వెళ్ళి సినిమా హాల్లో చొరబడ్డాం. కూర్చోవడం గొప్ప ఇబ్బందయింది ప్రకాష్‌కి. నల్లులూ.. దోమలూ కాదు. సిగరెట్ కాల్చుకోవడానికి పదిసార్లయినా బయటకు వెళ్ళి వుంటాడు. ఇంటికి వెళ్ళగానే అంత పెద్ద ఇంట్లోను కనిపించిన వస్తువు అమృతాంజన్ డబ్బా!

లీలామహల్‌లో టికెట్ దొరకలేదు. మిగతా హాళ్లలో ఏ సినిమాలు ఆడుతున్నవో ఎంక్వయిరీ చేసి .. దేనికీ వెళ్లబుద్ధి వేయక స్కూటర్ బీచ్‌కి పోనిచ్చేడు.

ఫేమిలీ వచ్చి వారమయింది. బుధవారం అతని కూతురు రమ పుట్టిన రోజు. ఎనిమిదేళ్ళు పూర్తయి తొమ్మిదో ఏడులో పడుతోంది. సాయంత్రం బీచ్ ప్రోగ్రాం పెడితే నాకు సినిమాయే కావాలంది రమ. పుట్టిన రోజునాడు పాపని ఏడిపించడం ఇష్టం లేక సినిమాకు తీసుకెళ్ళేడు.

పాప సినిమా ఆద్యంతం బాగా ఎంజాయ్ చేసింది. అది ఎంజాయ్ చేయడం వల్ల గాబోలు ప్రకాష్‌కి సినిమా బోర్ కొట్టలేదు. పాప నవ్వునీ, హావభావాలనీ సినిమా అయినంతసేపూ చూస్తూ ప్రకాష్, అతని భార్య మురిసిపోయేరు.

అయితే ఆ మరుసటి రోజే మళ్ళీ పాప వచ్చి ఒక రూపాయి అడిగింది.

"ఎందుకు?" అడిగేడు ప్రకాష్.

"మన కాలనీలో ఓపెనెయిర్ థియేటరుంది కదా. అందులో ఈ రోజు పిల్లల సినిమా వేస్తున్నారట. చాలా బాగుంటాదట మా టీచర్ చెప్పింది."

"రోజూ సినిమాలేమిటి? నిన్నే కదా వెళ్ళావు సినిమాకి! మళ్ళీ ఈ రోజు కూడానా! వద్దు. వెళ్ళి పుస్తకం తీయ్" అని కసిరేడు.

బిక్కమొహం వేసుకొని, ఏడుపు ఎగతన్నుతుండగా పాప నెమ్మదిగా కదిలింది.

"ఎందుకండీ. దాన్నలా కసురుకుంటారు? పిల్లల సినిమా అట గదా పంపిస్తే పోలా"

"పిల్లల సినిమా ఏమిటి? నీ మొహం! నిన్న చూసింది పిల్లల సినిమా కాకపోతే పెద్దల సినిమానా! సినిమా అది ఎంజాయ్ చేసిందా - మనం ఎంజాయ్ చేశామా? నిన్నే కాదు. ఈ మధ్య ఏ సినిమాకు మనం వెళ్ళామన్నా పాప కోసమేనా. దాని సరదా కోసమేనా.. మరిక వేరేగా పిల్లల సినిమా ఏమిటి?"

"చాల్లెండి. సినిమా అంటే పాపకే కాదు నాకూ సరదాయే"

"నీ సరదా ఎలాంటిదో చెప్పనా? చందమామ అనేది పిల్లల పత్రిక! కాని అందరూ చదువుతారు. ఇష్టపడతారు. నీకు సినిమా నచ్చడం కూడా అలాంటిదే"

"అంటే మనం చూస్తున్న చిత్రాలన్నీ పిల్లల చిత్రాలనా మీ ఉద్దేశ్యం?" - విస్తుపోతూ అడిగింది.

"అవును ఆరోగ్యకరమైనవి కాకపోవచ్చుగాని స్థాయిలో మాత్రం అవి నిస్సందేహంగా పిల్లల చిత్రాలే!" అన్నాడు ప్రకాష్.